కథానిక

# గున్నాల జత

యమ్. ఆర్. నాగమ్

దట్టమైన చీకటి, పైగా నభోమండలం మేఘాచ్ఛాదితమై ఉంది. ఎక్కడో రెండు మూడు తారకలుమాత్రం మినుకుమినుకు మంటున్నాయి. వాయువు సన్నసన్నగా కూనిరాగాలు తీస్తూ వృక్షలతాదులపై అటూఇటూపరుగులెడుతోంది. చుట్టూ గడ్డి గాదాల్లో, కంపపొదల్లో కీచురాళ్ళు కూచుని టీఁ...టీఁ...అంటున్నాయి ఎక్కడో బావుల వద్ద కుక్కలు మొరుగుతున్న చప్పుడు, చుట్టుపట్ల చేలల్లో దాక్కుని ఊళపెడుతోన్న గుంటనక్కల సవ్వడి, రవరవగా వినపడుతోంది. గ్రామానికిఉత్తరంగా అల్లంతదూరాన శ్మశానవాకటిలో ఓచోట ఓపెద్దమంట మండుతోంది. దానికి చేరువనే ఒక భగ్నజీవి ఆర్ద్రకంఠంతో ఏమేమో ఆలాపిస్తూ, మధ్యమధ్య ఆపి తన భుజంమీద మూటను చూస్తూ ఉన్నాడు. ఆతని కన్నులనుండి ఎడతెరిపిలేని కన్నీటి ధారలు ప్రవహిస్తూండటం, ఆ వెలుగుల్లో స్పష్టంగా కన్పిస్తోంది. తడియారని ఆ కన్నీటితో అతని ముఖం వాచి, ముద్దయిపోయింది.

భుజంమీది మూటను చూస్తూ, భుగభుగ మంటలను పరికిస్తూ అతడు గాద్గదికంగా రోదిస్తున్నాడు. "లచ్చిఁవీ! నాతో సెప్పకనే ఎల్లిపోతన్ననా లచ్చిఁవీ? బావా! బావా! అని ఎంతో యిదిగా నన్ను బులిపించిన దినాలు మరిసి, కొసకు పాపాయినైనా కల్లకు జూపక, నేను వూరినించి రాకముందే మాయఁవైతన్నవా లచ్చిఁవీ? నన్ను జూచి భయపడ్డావా? నే నెప్పుడైనా నిన్ను తిట్టేనా, కొట్టేనా పిల్లా? నా లచ్చిఁవి నాకో బంగారుపాపని యిస్తదని సంబరాలపడి నీకోసం పేటకెల్లి గున్నాల జత దెచ్చినానే పిల్లా! ఇంక నన్నా మాట్టాడవా? పాపని సూపించవా?...ఏదీ ఒక్కసారి సూపిచ్చు; అంతే చాలు! మామ్మ, మాయ్య పోయి శానాకాలవఁయింది. ఆల్లని పాప మొకంలో సూడాలని ఎంతోకాలం నించి అనుకుంటున్న. లచ్చిఁవీ! ఒక్కసారి సూపించు."

దుఃఖోద్వేగంతో కువారిల్లిపోతూనే భుజంమీద మూటను విప్పేడు. అందులో ఒక కుల్లాయీ, చిన్న చొక్కా, ఓ గున్నాలజత ఉన్నాయి. అపడా గున్నాల జతను మండుతున్న కాష్ఠం మీదా, కుల్లాయి-చొక్కాలను దాపునే ఉన్న ఓ బొందమీదా పెట్టి, ఆగలేక బాధతో దభాలున క్రిందపడి కంటికి కడివెడు కారుస్తున్నాడు. ఆ సమయంలోనే ఓమూల గ్రామంలో అస్పష్టమైన ఆర్తనాదాలు వినపడుతున్నాయి...

ఆతని పేరు వెంకులు. వెంకులుకు అతని లచ్చఁవి దప్ప యీ భూమ్మీద యింకెవరూ లేరు. అతడు పుట్టీ, పెరిగీ కొంచెం బుద్ధి-జ్ఞానం తెలిసినాక మానెడుజొన్నల కరువులో తినడానికే లేక తల్లీ తండ్రీ దాటిపోయారు. గ్రాసంలేక వున్న రెండు దున్నలూ ప్రాణాలు విడిచాయి. తరువాత వెంకులును అతని మేనమామ చేరదీసి, యీడు ముదరగానే పిల్లనిచ్చి పెళ్ళిజేసేశాడు. ఆ ఒక్క పిల్ల-వెంకులు పెళ్ళాం - లచ్చిఁవి దప్ప అతనికింకెవరూ లేరు. అతడు కూడా తల్లిదండ్రులకు ఒకే ఒకడు. తన వంశానికి చెందినవారు ఎవరూ తనకు లేకున్నా తన కిప్పుడో లచ్చిఁ వుంది; అంతేచాలు అనుకున్నాడు వెంకులు. మామ సాయంతో కొద్ది కాలంలోనే మళ్ళీ రెండు ఎద్దుల్ని సంపాదించి, తల్లిదండ్రులు విడిచివెళ్ళిన తాలూకు పూర్ణ శిథిల వ్యవసాయం పునరుజ్జీవం జేశాడు. అతనికో బండీ ఉంది. తీరిక సమయాల్లో ఎవరైనా అడిగితే బండి బాడుక్కి కూడా పోతాడు. "దేహీ" అని ఎవరినీ యాచించే మనస్తత్వం కాదతంది. కలిగిందాంట్లోనే అతనూ, లచ్చిఁవీ కలో, గంజో చేసుకుని తాగుతూ పరస్పర ప్రేమానురాగాలతో కాలం వెళ్ళబుచ్చుతుండేవారు. ఏదైనా సందర్భములో కస్సుబుస్సు మనుకుంటే, పరిహాసాలతో

ఒకరినొకరు నవ్వించుకుని, బుజ్జగించుకుని వాళ్ళలో వాళ్ళే సమాధానపడేవారు. ఇరుగుపొరుగు అమ్మలక్కలకు గూడా వీళ్ళ సరసాలు చూడ ముచ్చటగా ఉండేవి.

వెంకులుకుంది చాలా కొద్ది కమతం; అరెకరం మాగాణీ. మూడెకరాల మెట్టపొలమూ ఉంది. దాంట్లోనే సంవత్సరాల పొడుగునా అంగలార్చి, పాటుపడి ఓ కొంచెం ఫలితాన్ని అనుభవిస్తుండే వాడు. స్వతహాగా రైతు సంప్రదాయంలో పుట్టి పెరిగినవాడు కాబట్టి అతనికి ఎడ్లన్నా, దొడ్లన్నా, బండ్లన్నా, చెట్లన్నా ఎంతో ప్రేమ. రెండు ఎద్దుల్నీ ప్రొద్దస్తమానం కష్టం చేయించి, సాయం కాలాలు ఇంటికి తోలుకుపోయి ఎంతో యిదిగా కుడితీ, దాణా పెట్టేవాడు. అప్పుడప్పుడూ ఆ ఎద్దుల్ని దువ్వుతో, సంతోష గర్వంతో ఉబ్బిపోయి. "లచ్చింవీ! రొండుమూడు పసులు గనక యింటిముందుండి, కోద్రంత భూమేగాని రైతు కుందంటే మరింక పెరాయోల్లకు చెయిజాపేగతి పట్టుద్దానె పిల్లా?" అనేవాడు. ఆ మాటమీద లచింవి అతని భుజంపట్టుకు వ్రేళ్ళాడి, "నువు గట్టంటె నాకు మాచెడ్డ సంతోసం కలుగుద్దిబావా!" అనేసేది "హూఁ! అదెట్టుంటదో సూద్దాం" అంటూ లచ్చింవి శిఖపట్టుకుని అటూయిటూ ఊపేవాడు వెంకులు. అప్పుడు ఆమె ముఖమంతా చిట్లించుకుని "పో బావా!" అని తుర్రున అలిగి యింట్లోకి పోయేది.

లచింవి అలిగితే మరి నెమ్మదిగా మాట్లాడే మనిషికాదు. అందుకని తనూ అలిగినట్టు నటించి ఆరేత్రి అన్నం పెట్టమని అడిగేవాడు కాదు వెంకులు..., ఇలా ఎంతోరాత్రి మాడుమోముల్తో గడిచాక తిరిగి లచ్చింవే ముందుకువచ్చి తన బావను బ్రతిమలాడి తినిపించాల్సి వచ్చేది. ఆ విధంగా వాళ్ళిద్దరు మళ్ళీ ఆనందోదధిలో ఓలలాడే వారు. నిండు జీవనదులకుమల్లే వాళ్ళ నవ్వులకు అంతూ పంతూ ఉండేదికాదు.

ఆ నాడు కుడుములపండుగ. లచ్చింవి గుడిసెనంతా అలంకరించి, అలికి ముగ్గెట్టింది. పెందలాడే పనిపాట్లూ ముగించుకుని కుడుములు జేసింది. అంతకు మూడురోజులక్రితం వెంకులు ఎక్కడికో బండితొడుక్కొ పోయాడు. సరిగ్గా కుడుముల పండగకి యింటికి చేరుకుంటానని చెప్పాడు. కానీ...ఆ నాడు జాముప్రొద్దెక్కినా అతను జాడలేదు. లచ్చింవి వేయికన్నుల్తో బావకోరకు ఎదురు తెన్నులు చూస్తోంది. ఊరోళ్ళంతా "దియ్యో దియ్యో" అంటూ కుక్కల్ని పిలిచి కుడుంముక్కలు అందిస్తున్నారు. ఇండ్లకప్పులమీద చుట్టూ కుడుంముక్కలు జోరుగా పడుతున్నాయి. అవిచూసి లచ్చింవి నిరీక్షణ యింకా అధికమయింది.

అంతల్లో గల్లుగల్లుమనే మూగల చప్పుళ్ళతో బండివచ్చి గుడిసెముందాగింది. లచ్చింవి ఆనందానికి అప్పుడు అవధుల్లేవు. సంతోషంతో కోపాన్ని మిళితంచేసి "రాబావా! ఇయ్యాల నీకోసరం ఎంత ఎదిరిచూసినన్నో తెల్సునా!"

అయ్యోమరి! కుడుములేవైనా కుక్కలకు కొరికేస్తివా? లేదా? యింతకూ" అంటూ బండిని విప్పేసి లచ్చింవి చేయిపట్టుకుని గుడిసెలో దూరేడు.

ఇంటిమీదా, కుక్కలకూ కొరికేయడం అయిం తరువాత యితంత పెసరపప్పూ, ఓ కొన్ని కుడుములూ ముందెట్టుకోని యిద్దరూ తినుట కూర్చున్నారు. అప్పుడు లచ్చింవి అన్యాపదేశంగానే, "బావా! యిప్పుడు అత్తా - మాంవ ఉంటే ఎంత బావుణ్ణు! ఎప్పుడూ కండ్లల్ల మెదిలినట్టే ఉంటుంది" అంది.

ఈ మాటతో వెంకులు కండ్లు చెమ్మగిల్లినాయి. అతడావిషయం మరిచి ఎంతోకాలమయింది. వాళ్ళమీద అతనికి ప్రేమలేదనికాదు. కాని, లచ్చింవికి ముందు ముందు పుట్టే పాపాయిలకు తన తలిదండ్రుల పేర్లు బెట్టుకుని ఆ మార్గాన వాళ్ళని స్మరించాలని అతడు నిశ్చయించుకుని ఉన్నాడు. అందుకే లచ్చింతో అన్నాడు. "ఇశారమెందుకే పిచ్చిపిల్లా! ఇంకొద్దిరోజులయితే మనకు బుజ్జిగాల్లు కలుగరూ!" అని మళ్ళీ వెంటనే, "ఒసేసిల్లా! నిన్నో టడుగుతా; మరి నువ్వింకా గొడ్డుదానోలె ఉన్నవేందే!" అన్నాడు. ఆ మాటకు లచ్చింవికి బలే రోషం వచ్చింది. "ఒస్ యింతేనా బావా! నువు సూత్తుండరాదు. మల్లా కుడుముల పండగకి మనకో బుజ్జిగాడు పుడ్తడు" అంది.

వెంకులుకు పట్టపగ్గాల్లేని ఆనందం కలిగింది. లచ్చింవి రెండు భుజాలూ పట్టుకుని "నిజవే...

నిజంవేనా లచిమి! అయితే యిగ్గో యిటు సూడూ! ఈ డబ్బుల్ని నీ పేరుతో ముడుపు గడతన్న. నువు నిజంగా మల్లీ నాటికి పాపాయిని గంటే యీ డబ్బుల్తో నీకు గుసాన్నలజత కొనుక్కొచ్చి పెడ్త. ఏంవంటవ్?" అని తన పాగాకొమ్ము నున్నబండి అద్దె తాలూకు పైకంవిప్పి లచ్చిమి పవిటకొంగున ముడివేశాడు. అవాళ అతని సంతోషానికి మేరల్లేవు ఆ నాటి కుడుములన్నీ ఒక్క దమ్ములో వెంకులు దంపతుల ఆనందాతిరేకాగ్నికి ఆహుతయాయి.

గడియారం తిరిగింది. గంటలు దాటినాయి. రోజులు గడిచినాయి. నెలలు సంవత్సరంగా మార్పు చెందనున్నాయి, చూస్తుండగానే మళ్ళీ కుడుముల పండుగ సమీపించింది. లచ్చిమి తన వాగ్దానం చెల్లించబోతున్నది. ఆ తరుణానికి ప్రస్తుతం ఆమె చాలాదగ్గరలో ఉంది. ఇక మిగిలింది వెంకులుమాట ఆ విషయంలా అతడూ అప్రమత్తుడయ్యే ఉన్నాడు. లచ్చిమిని ఆమె తల్లిదండ్రులకు అప్పగించి, వేయి కన్నుల్తో ఆమెను చూస్తుండమని హెచ్చరించి వెంకులూ తన మాట నిలుపుకోడానికి పేటకు ప్రయాణమైనాడు. అతనికా ప్రయాణం లెక్కలోనిదికాదు; పైగా అతని లచిమి నీళ్ళాడబోతోన్న సమయమది.

సూర్యోదయానికింకా కొండికూత ప్రొద్దుఉంది. వెంకులు సద్దిమూట పుచ్చుకుని బయలుదేరాడు. త్రోవలో నడుస్తూఉంటే రకరకాల ఆలోచనలు. వాటితో మార్గాయాసం అనేదే లేకుండాపోయింది; లచ్చిమి తప్పని సరిగా మగచిన్నవాణ్ణే కంటుంది. వాణ్ణి అల్లారు ముద్దుగా పెంచాలి. తనకంటే అచ్చుగీతలు రాకపోయినాయి. వాణ్ణయినా బళ్లో చదివేయించాలి. రెండు అచ్చరాలు నేరిస్తే ఊళ్లో యింకా తలెత్తుకు తిరగొచ్చు. వెధవ గీతలు! అవొచ్చిన ప్రతివారికీ వంగి వంగి సలాములు చేయాల్సి వస్తోంది. తమ వంశంలో తన పిల్లవాడికైనా రెండు గీతలొస్తే ముందు వెనకల మూడు నాలుగుతరాలకు గొప్ప పేరుంటుంది. ఏమిటోదీర్ఘాలోచన గాలిలో మేడలు నిర్మింప బడుతున్నాయి..

ఆధారంలేని ఆలోచనలనుకుని వెంకులు ఒక్కసారే భయవిహ్వాలు డైనాడు. ఏటిదగ్గిర కొంచెంసేపు కూచుని హృదయవేగాన్ని తమాయించుకున్నాడు. తనకుతానే దిలాసా చెప్పుకున్నాడు–అలా జరక్కూడదు. తన ఆలోచనలేవీ యింతక్రితం నిరాధారం కాలేదు. ఇకముందూ కావు...

వెంకులు తిరిగీ నడక సాగించాడు. అప్పుడే కరకర ప్రొద్దు పొడుస్తోంది. ఉదయకాలపు మలయమారుతము శ్రావ్యంగా హోరుపెడుతూ వెంకులును గిలిగింతలు పెడుతోంది. పక్షుల కిలకిలలు అతనిలో నవోత్సాహాన్ని రేకెత్తించాయి. వాటితో పాటు అతడూ ఏదో తనివితీరని మధురానుభూతిని అనుభవిస్తున్నాడు. లోపల్లోపలే మురిసిపోతున్నాడు.

వెంకులు పేటకు జేరుకునేప్పటికి బాగా ప్రొద్దు ఎక్కివచ్చింది. ఊరిబయట గుబురుచెట్ల బావి దగ్గర సద్దిమూటను ఖాళీచేసుకుని అతడు పేటలో ప్రవేశించాడు. రంయ్‌రంయ్‌మని మోటర్లూ, సైకిళ్లూ తెగతిరుగుతున్నాయి. దుకాణాలమీదా అక్కడక్కడ ఎంతోమంది వస్తూపోతూ గజిబిజిగా ఉన్నారు. వెంకులు చక్కా ఓ బట్టలదుకాణం ఎక్కి "గుసాన్నలజత ఎంతకిస్తవు?" అని అడిగాడు. దుకాణంలోనివారంతా హేళనగా నవ్వేరు. ఏమీ చెప్పకనే "వెళ్ళు వెళ్ళు" అన్నారు. ఈమాత్రం దానికే పరియాచకం ఎందుకో! ఫలానాచోట దొరుకుతాయని తెలియజెప్పితేకాదూ...

కాలు నిలువకుండా తిరిగి తిరిగీ చివరికెలాగో ఆ దుకాణం కనుక్కొగలిగాడు వెంకులు. దుకాణంలోని వింతవింత వస్తువులూ, రకరకాల ధరలూ చూసి అతను విస్తుపోయాడు. తనదగ్గరున్న పైకానికి గుసాన్నలు రావేమోననుకున్నాడు మొదట. కాని పూర్తిగా తెలుసుకున్నాక, ముందు తను భయపడినందుకు సిగ్గుపడ్డాడు. వాటి ఖరీదు అయిదు రూపాయలే. తనవద్ద ఎనిమిదిరూపాయిలున్నాయి. గుసాన్నలజతకు పోను యింకా మూడు మిగుల్తుయికూడా. వాటితో బుజ్జిగాడికి చొక్కా, కుళ్ళాయీ కొనొచ్చు...గుసాన్నలెంతో బాగా కూడా వున్నాయి; పైగా వాటికి బంగారుపోతపోశారని దుకాణాదారు చెప్పాడు. ఎర్రగా, ముద్దుగా ఉన్నాయి...తళుక్ తళుక్‌మని మెరుస్తున్నాయి. అన్నట్టు 'గుసాన్నల'నే 'గంటీలం'టారన్నమాట. తను గుసాన్నలు చూపించమంటే దుకాణా

దాయకేమీ అర్థంకాలేదు. బస్తీలలో కొన్నికొన్నిటి పేర్లే విచిత్రంగా ఉంటయ్.

అయిదురూపాయిలిచ్చి వెంకులు గున్నాలజత తీసుకున్నాడు. అప్పుడుగానీ అతని మనస్సు కుదుటపడలేదు... ఓ కొన్ని గారెముక్కలు కొని తినుకుంటూ అలా వీధులవెంట నడుస్తున్నాడు. ఓచోట దర్జీమిషన్‌వద్ద కుట్టిఉంచిన చొక్కాలూ, కుళ్ళాయిలూ కన్పించాయి. తిన్నగా వెంకులు అక్కడికి వెళ్ళి, బేరంచేసి రెండురూపాయిల్తో ఓ పచ్చచొక్కా, నల్లటి కుల్లాయీ తీసుకున్నాడు. వాటన్నింటిని పదిలంగా కండువాలో కట్టేడు.

ప్రొద్దు నడినెత్తికి తిరిగింది. వేడిమి అధికంగా లేకపోయినా మబ్బులచాటున దాగిన ఎండతో అమితమైన ఉక్కపోతపోస్తూంది, ఎక్కడా గాలి చలనంలేదు.

వెంకులు తిరుగుముఖంపట్టి బయలుదేరేడు. పేట వెలుపల గుబురుచెట్ల బావివద్ద కొద్దిసేపు విశ్రాంతితీసుకుందికి ఆగిపోయాడు. అతని మనస్సులో రకరకాల ఆలోచనలు. బస్తీల్లోని ఒక్కొక్క మేడా, ఆ మోటార్లూ, ఆ సైకిళ్లూ, క్రిక్కిరిసినట్టుండే జనమూ—అబ్బబ్బబ్బ! తను ఏ తిరునాళ్ళలో కూడా అంతమందిని చూడలేదు.

ఆయీ ఆలోచనా తరంగాలలోనుండి లచ్చిఁవిని గూర్చిన ఆలోచన తట్టింది తనకి. గున్నాలజతపై అతని మనస్సు పూర్తిగా లగ్నమైఉంది. మూటను విప్పిచూచుకుని ఏమిటేమిటో తనలోతానే మురిసిపోతాడు. అవి తొడుక్కుని తన లచ్చిఁవి ఎలా ఉండాలి! దాని ఎర్రటిరంగు... పెద్ద మొకం... మూంచి పొడుగాటి జడ... చింతనిప్పల్లాటి కళ్లూ, చక్కని గొంతూ—అబ్బ! తన లచ్చిఁవి గున్నాలు పెట్టుకుని దొరసానోలె ఉండదూ!

ఊహా సౌధాలు యధావిధిని తయారవుతున్నాయి. వెంకులు ఆ తన్మయత్వంలోనే తిరిగి దానిపట్టేడు. కాని అంతలోనే తెల్లని ఆకాశం నల్లని మేఘాలతో ఆవరించుకు పోయింది. వెంటనే హోరుమనే ధ్వనితో గాలి మొదలయింది. అంధకారంలా ఎటుజూచినా వెలుగు రేఖలు పొడకట్టలేదు చుట్టుపట్టు నున్న చెట్టు, గట్టులేవీ కన్పించనంత దట్టంగా మంచుపట్టింది. చూస్తుండగానే భూమ్యాకాశాలు ఒకటై ఉఱుములు దద్దరిల్ల సాగేయి. గమనపథం దుస్తరమై పోయిన ఆ వాతావరణంలో మధ్యమధ్యన మెఱుపులుమాత్రం మెరుస్తున్నాయి. కానీ అవి క్షణికమైన మెరుపులు; కూలిపోయే ప్రాణికవి జీవితాన్నివ్వలేవు.

ఆ వెంటనే కుండపోతగా వర్షము కురువసాగింది. ఆ వర్షపాతంలో వెంకులుతడిసి బిఱ్ఱబిగిసిపోయాడు. అయినా, నడకనేమీ ఆపలేదతడు. పట్టుదలతో జారుతూనే వర్షంలో సైతం నడుస్తుద్నాడు. ఎంత రాత్రికైనా యిల్లు చేరడం అతని ధ్యేయం. ఎన్ని అవాంతరాలు వచ్చినా గమ్యం మరువలేదు.

వర్షం ఉరవడి యేమీతగ్గలేదు. కాలువలే నదులై ప్రవాహ వేగంతో సాగుతున్నాయి. మిట్టలు, వంపులు అన్నీ ఏకమైనాయి. ఆకాశం నల్లగొంగళివలె ఉంది.

వెంకులు త్వరత్వరగా నడుస్తున్నాడు. నడుస్తూ ఏటిదగ్గరికి చేరుకున్నాడు. కాని ఇక ముందడుగుకి వీలులేదు. ఏరు ఆ వొడ్డు యీ వొడ్డు పూసి పారుతోంది. వెంకులుకాదు గదా! మహా మహా ఏనుగులైనా ఆ ఉరవడికి తట్టుకోలేవు. ఎంత తొందరవున్నా, మరెంత పట్టుదల గలవారికైనా జలప్రవాహ వేగానికి తమ ఆటలు కట్టిపెట్టక తప్పదు.

వెంకులు ఓ తాటిచెట్టు మాటున వణుకుతూ నుంచున్నాడు. నీటిధాటిని చూస్తో ఆరోజు తనిక యింటికి చేరడం కల్ల అని భయపడినాడు. అంత వణుకులోనూ, అట్టి భీకర వాతావరణంలోనూ అతని మురిపెమూ, ఆశాలతా ఏమాత్రం సన్నగిల్లలేదు. అపూర్వమైన ఆనందాన్ని తనిక అనుభవించగలడనే ధైర్యమే అతని యీ ఉత్సాహానికి కారణం.

వర్షం కొంత చల్లబడింది. ఎవరో ఒకరిద్దరు బాటసారులు తడుస్తూనే అక్కడికి వచ్చారు. ఏటిధాటిని చూచి వారిగుండెలు అదురుతున్నాయి. వెంకులును సమీపించి కొంతసేపు బాతాఖానీ చేశారు. ఒకరోజైనా కాందే ఏరు తీయడం జరుగదనీ, కాబట్టి వెనక్కు తిరిగిపోవడమే మేలనీ, వెంకులును తమతోకూడా రమ్మన్నారు వారు. కాని వెంకులు ఎక్కడికి వెళ్ళగలడు? ఎలా వెళ్ళగలడు? ఎంతకాలంగానో తానిక్కడ మనిషైనా కాగలడేకాని అక్కణ్ణుంచి వెనక్కు తిరగడమనేది జరుగదు. అందుకని తానక్కడే ఉంటాననిచెప్పి వారిని వెళ్ళమన్నాడు.

మబ్బుల్లో ప్రొద్దు కానరాలేదు. చాలా ప్రొద్దే పోయినట్టుంది. వర్షం పూర్తిగా తగ్గి సన్నని తుషారం రాలుతోంది. అయినా ఎండపొడ లేదు. వెంకులుకు ఎటూ పాలుపోలేదు. ఎప్పుడు యిల్లు చేరుదునా! ఎప్పుడు లచ్చిమిని చూడగలనా? అనే తలపోస్తున్నాడు... ప్రొద్దుగూకు సమయమైంది.

అప్పటికి ఏరు కాస్తా తీసింది. మధ్యమధ్యన యిసుక దిబ్బలు కానవస్తున్నాయి. చీకట్లు అప్పుడప్పుడే లోకాన్ని ఆవరిస్తున్నాయి. వెంకులు ధైర్యంతో పోవ నుద్యుక్తుడై చేతికర్ర సాయంతో లోతులు గోతులు చూస్తో, సుళ్ళు—తిరుగుళ్లు కనిపెడుతూ సాగిపోయేడు. అక్కడక్కడ ప్రమాదకరంగా కాళ్ళుజారినా, కర్రఉండటంవల్ల సురక్షితంగా ఆవలిగట్టుకు చేరగలిగాడు. చేరి, ఒకసారి మూటలోని గున్నాలూ, బట్టగుడ్డలూ విప్పి చూసుకుని, తడిసిన బట్టలు పిండుకుని త్రోవబట్టేడు. వాళ్ళఊరు అప్పటికింకా మూడు, నాలుగుమైళ్ళ దూరాన ఉంది.

ఇల్లు దగ్గరవుతూన్నకొద్దీ వెంకులుకు ఉద్వేగము జాస్తీకాజొచ్చింది. ఉద్వేగంతోపాటు ఏదో అనిర్వచనీయమైన జడుపుకూడా ప్రవేశించిందతనిలో. తిమిరాంధకారం బాగా వ్యాపించింది. బాట సరిగా కన్పించుటలేదు. ఓమూల ఆనందమూ, మరోమూల ఏదో భయమూ పీడిస్తోండగా అతడు పల్లెను సమీపించాడు. వెడుతూ, వెడుతూ ఓమారు గ్రామంవేపు తలెత్తి చూశాడు. గాఢాంధకారంలో మిణుగురు పురుగులల్లే అక్కడక్కడా సన్నసన్నని దీపపుకాంతులుదప్ప మరేమీ కన్పించుటలేదు. కాని, ఎక్కడో—ఏ మూలనుంచో—ఏ గుడిసెనుంచో మంద్రంగా రోదన ధ్వనులు వినవస్తున్నాయి. ఊరి బయట భుగభుగమంటూ పెద్ద మంటలు నాలికలుజాచి ఆకాశాన్ని అంటజూస్తున్నాయి...

వెంకులు ఒళ్లు జలదరించింది. మొదటే తడిసి బిర్రబిగిసిన శరీరం; పైగా ఊరిలోని దుఃఖాలాపనధ్వనులు విని మరీ కట్టెకరుచుకు పోయింది. అచేతనుడులా అయ్యాకూడా ఎట్లో దేహాన్ని యీడ్చుకుపోతున్నాడు. మనస్సు మనస్సులో లేదు. తన పరిస్థితికి తానే ఆశ్చర్యపోతూ పరుగు పరుగున ఊళ్ళోకి అడుగు పెట్టాడు. ఏమీ సందేహం లేదు... ఆ ఏడుపు తమ గుడిసెలోనే. ఏదో జరుగుంటుంది. భయోద్వేగంతో తమాయించుకోలేక పడిపోయి మళ్ళీలేచి పరుగు తీశాడు...!

“ఊరుకోవమ్మా... చక్కదనాల లచ్చిమి... లేకలేక కాన్పు ధరించింది. పోనీ రుబ్బురాయంతటి బిడ్డ—దొండపండులా ఉన్నాడు. వాడన్నా బతకూడదూ? ఇలా వీళ్ళందరిని వదిలిపెట్టి తల్లీ-బిడ్డా యిద్దరూ ఒక్కసారే పోవాల్నా? పాపం... మొగడైనా ఇంటిపట్టు లేడాయె. బిడ్డడు ఎక్కడెక్కడ కష్టాలు పడుతున్నాడో!... ఈ మాటలు వెంకులుకు కష్టంగా విన్పించినయ్. వెంకులు గుడిసె ముందు అతని అత్తా, మామా, యింకా యిరుగింటివారూ, పొరుగింటివారూ చాలా మంది గుంపుగా ఉన్నారు. అంతా గుమిగూడి మొత్తుకోలు జేస్తున్నారు.

విషయం తెలిసి వెంకులు ‘లచ్చిమీ లచ్చిమీ’ అంటూ అలా ఉరికి గుడిసెముందు బొక్కబోర్లా పడిపోయాడు. ఒక్కసారె గుంపంతా రోదించింది ఆగలభాతో ఊర్లో ప్రజలు తండోపతండాలుగా వచ్చి అతని దయనీయస్థితికి కంటనీరెట్టారు.

“నాలచ్చిమి ఎల్లిపోయిందా? అప్పుడే మీరు దాన్ని సాగదోలిర్రా? అయ్యో నాపాడుబతుకు! కడసారి కండ్లతోనైనా సూచుకోలేక పోయితిని... నా లచ్చిమి నామీద అలిగిపోయిందేమో! బుజ్జిగాణ్ణికూడా ఎత్తుకుపోయింది.” పొంగి పొరలి దుఃఖించాడు వెంకులు. తలను నేలకేసి ఒకటే బాదుకున్నాడు...

వెంకులు హఠాత్తుగా లేచాడు. లేచి స్మశానం వేపు పరుగుతీశాడు. “లచ్చిమీ!... నా బుజ్జాయిని తీస్కపోతన్నవా లచ్చిమీ! నాతో సెప్పకనే పోతన్నవా? ...గున్నాలు తొరగా తేలేదని నా మీద అలిగిపోతన్నవా?... లచ్చిమీ!... నాతోటి మాట్లాడవా... నాతోటి మాట్లాడవానె పిల్లా!” అంటూ ఉన్మాదిలా అరుస్తూ, బొబ్బపెట్టుతూ, ఆ గాఢతిమిరాంధకారంలోనే ఏదో వెతకడానికా అన్నట్టు శ్మశానం వేపుపరుగున పోతున్నాడుకానీ ...అతని లచ్చిమిమాత్రం... అతనిమీదఅలిగి... అతనితో చెప్పకుండానే... పాపాయి నెత్తుకుని, పోయింది.

★